

పెండింగ్ ప్రాజెక్టులు ఇక పరుగులు

- కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష
- 2025 డిసెంబరు చివరి వరకు పెండింగ్ ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయాలని ఆదేశం
- గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు అందిస్తామని వెల్లడి
- ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- కోయిల్‌సాగర్ కింద కొత్త లిఫ్టుల ఏర్పాటును పరిశీలించాలని సూచన
- ఇరిగేషన్ వసతుల కల్పనపై ముఖ్యమంత్రికి విన్నవించిన ప్రజాప్రతినిధులు
- పని చేసే కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి; చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ఆదేశించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాల కింద పెండింగ్‌లో ఉన్న పనులు, కావాల్సిన నిధులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నెల 14 లేదా 15న నీటిపారుదల శాఖ మంత్రితో నిర్వహించే సమీక్ష సమావేశం నాటికి వీటిపై నివేదిక ఇచ్చి, తుది అప్రూవల్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత గ్రామం, మండలం వారీగా ఆయకట్టు వివరాల రిపోర్టు, సూక్ష్మస్థాయిలో ప్రతీ అంశం ఉండేలా ప్రాజెక్టు స్టేటస్ రిపోర్ట్ రెడీగా ఉంచుకోవాలన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల్లో ప్రధానంగా ఆర్ అండ్‌ఆర్, భూసేకరణ, పెండింగ్ బిల్లుల సమస్య ఉండగా.. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, భవిష్యత్‌లో వివాదాలకు తావులేకుండా రిపోర్టులు సిద్ధం చేయాలని చెప్పారు.

పాలమూరుకు సీఎం వరాలు

మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి వరాలు కురిపించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్ సమీపంలో ఉర్దూఘర్ నిర్మాణం కోసం రూ.15 కోట్లు, షాదీఖానా కోసం రూ.25 కోట్లు, మౌలాలి గుట్టలో గ్రేవ్‌యార్డ్ నిర్మాణం కోసం రూ.ఐదు కోట్లు మంజూరు చేశారు. పాలమూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినందున ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా బిడ్డగా జిల్లాకు వందల పరిశ్రమలు తెచ్చి, లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎంను కోరారు.

2025 డిసెంబరు నాటికి కల్వకుర్తి పనులు పూర్తి చేయాలి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 2025 డిసెంబరు చివరి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ నెలా ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలించి.. సాంకేతిక సమస్యలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తికి ఎంత సమయం పడుతుంది?.. ఎంత మొత్తం నిధులు కావాలో స్పష్టంగా రిపోర్టులు తయారు చేయాలన్నారు. ఆర్డీఎస్‌కు సంబంధించి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తో చర్చించాల్సిన విషయాలను, పరిష్కరించాల్సిన అంశాలపై నివేదిక రూపొందించాలని సూచించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పూర్తికి ఏం కావాలో, ఆర్డీఎస్‌పై కొత్త ప్రతిపాదనలు ఏం అవసరమో తెలియజేయాలని కోరారు. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంపై సమీక్ష సందర్భంగా ఆర్ అండ్‌ఆర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. అవసరమైతే గ్రామ సభను నిర్వహించి.. రిజర్వాయర్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయినవారికి పునరావాసం కల్పించాలన్నారు.

పరిశుభ్రత బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు

విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పంచాయతీకి ఒక పాఠశాల, మండలానికి జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ ఉండాలని తెలిపారు. విద్యాధికారులు, కలెక్టర్ పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పీహెచ్‌సీల బలోపేతం కోసం గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. అత్యంత వెనుకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్య, వైద్య రంగాల్లో సమస్యలను పైలెట్ పద్ధతిన పరిష్కరించాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు ఇస్తామని, ఇక్కడ సత్ఫలితాలు వస్తే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. సెక్రటేరియట్ నుంచి పంచాయతీల వరకు ఫేస్ రికగ్నేషన్ ద్వారా హాజరు తీసుకుంటామని తెలిపారు.

కార్యకర్తల్లో జోష్

కార్యకర్తల సమావేశంలో సీఎం ప్రసంగం వారిలో జోష్ నింపింది. తాను నాయకులకు నాయకుడిని కాదని, కార్యకర్తలకు కార్యకర్తనని, కార్యకర్తలను కలుసుకోవడంలోనే తనకు సంతోషంగా ఉంటుందని సీఎం అన్నారు. అందుకే ఇవ్వాళ ముఖ్య కార్యకర్తలను కలుసుకోవాలని ఈ సమావేశం ఏర్పాటు చేయించానని చెప్పారు. మరోసారి సమావేశం ఏర్పాటు చేసి, అందరినీ కలుస్తానని చెప్పడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు పర్యటన సక్సెస్ కావడంతో అటు నాయకులు, ఇటు బందోబస్తు నిర్వహించిన పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 7:15 గంటల వరకు దాదాపు 6 గంటల పాటు జిల్లా కేంద్రంలో సీఎం పర్యటన సాగింది. దాదాపు 1000 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ప్రాజెక్టుల కింద ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచే విషయాన్ని ప్రతిపాదనలతో వస్తే ఆలోచన చేసి, నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అన్ని ప్రాజెక్టులు డిసెంబర్ 2025 కల్లా పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు.

పార్టీ కార్యకర్తలతో సమావేశం

సమీక్ష అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఏఎస్ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీని నమ్ముకుని, నిబద్ధత పని చేసే నాయకులకు సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని అన్నారు. త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికల కంటే ఎక్కువగా ప్రచారం చేయాలన్నారు. తాను కూడా సుడిగాలి పర్యటన చేస్తానని తెలిపారు. కార్యకర్తలు పార్టీని అధికారంలోకి తెచ్చారని, పార్టీ కూడా అదే విధంగా అండగా ఉంటుందని తెలిపారు.

పాలమూరు-రంగారెడ్డికి జూరాల నుంచి నీరు తీసుకోవాలి: డీకే అరుణ

సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ పాజెక్టుల కింద భూసేకరణకు చెల్లింపులు చేయాలని, గతంలో పూర్తయిన ప్రాజెక్టులకు సైతం తక్షణమే చెల్లించాలని కోరారు. నెట్టెంపాడు 99వ ప్యాకేజీ ఇంకా పూర్తి కాలేదని, జూరాల నుంచి పాలమూరు-రంగారెడ్డికి నీరు తీసుకుంటేనే త్వరగా పూర్తవుతుందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ఒకసారి ఆలోచన చేయాలని సూచించారు. నారాయణపేటలో టెక్స్‌టైల్ పార్కు, గద్వాలలో హ్యాండ్‌లూమ్ పార్కు, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం తర్నికల్‌వైపు ఒక లిఫ్టు ఏర్పాటు చేయాలని కోరారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గానికి ఒక రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను మంజూరు చేస్తే త్వరగా పూర్తవుతాయని తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడును పటిష్ఠం చేస్తే 10 టీఎంసీల నీటిని నింపుకోవడంతోపాటు గట్టు లిఫ్ట్ ద్వారా నాలుగు టీఎంసీలను స్టోర్ చేసుకోవచ్చన్నారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ మాట్లాడుతూ.. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద వల్లూరు, జూలకల్, మల్లమ్మకుంట రిజర్వాయర్లు నిర్మిస్తే అలంపూర్ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికా రెడ్డి, వీర్లపల్లి శంకర్, విజయుడు, ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, బుర్ర వెంకటేశం, ఆర్‌వీ కర్ణన్, ప్రశాంత్ జీవన్ పాటిల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ సామర్థ్యాన్ని పెంచాలి

ఎలాంటి ఆర్‌అండ్‌ఆర్ సమస్య లేకుండా కోయిల్‌సాగర్ సామర్థ్యాన్ని పెంచాలని సీఎం చెప్పారు. ప్రస్తుతం డిజైన్ చేసిన ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల తెలిపారు. కోయిల్ సాగర్ కింద హజిలాపూర్, చౌదర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, ఎత్తిపోతల పథకాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న సీఎం



మహిళా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి





మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి





ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి

మహిళా సంఘాలు బలోపేతం

- స్వయం ఉపాధి యూనిట్లకు ప్రాధాన్యం
- 5,345 యూనిట్లతో 6,675 మందికి లబ్ధి
- రూ.54.04 కోట్ల రుణాల పంపిణీకి ఏర్పాట్లు
- బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలకు ఇది అదనం



రుణంతో రొట్టెల మిషన్ కొనుగోలు చేసి, వ్యాపారం చేస్తున్న మదనపల్లి వెంకటమ్మ

గద్వాల, జూలై 9: మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తుండటంతో బ్యాంకులు కూడా ఆ సంఘాలకే లోన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దాంతో సంఘాలలో చేరేందుకు మహిళలు ముందుకొస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం రూ.170 కోట్లు ఉండగా.. రూ.191 కోట్ల రుణాలు ఇచ్చారు. అదే విధంగా స్త్రీ నిధి రుణాల కింద మరో రూ.11 కోట్ల రుణాలు ఇచ్చారు. వీటి రికవరీ రేటు దాదాపు 95 శాతం ఉంది. అందుకే ఈ ఏడాది బ్యాంకు లింకేజీతో పాటు స్వయం ఉపాధి యూనిట్లను అందిస్తున్నారు.

5,345 స్వయం ఉపాధి యూనిట్లు

జోగుళాంబ గద్వాల జిల్లాలో మహిళా సంఘాలు పటిష్ఠంగా ఉన్నాయి. వాటిలోని మహిళలకు స్వయం ఉపాధి యూనిట్లను అందించి, లక్షాధికారులను చేయడంతో పాటు మరికొంతమందికి ఉపాధిని చూపించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాది జిల్లాకు 5,345 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు అయ్యాయి. వాటిని 6,675 మంది మహిళలకు అందించనున్నారు. వాటిలో కొన్ని 35 శాతం వరకు సబ్సిడీ రుణాలు కూడా ఉన్నాయి. ఆసక్తి గల మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్ కింద 3,449 మందికి అవకాశం ఉంది. వీరికి రూ.3.98 కోట్ల రుణాలను అందించనున్నారు. అదేవిధంగా 50 కుట్టు మిషన్ కేంద్రాలకు రూ.2.80 కోట్లు, పాల ఉత్పత్తులకు 500 మందికి రూ.4.50 కోట్లు, కోళ్ల పెంపకానికి 1,200 మందికి రూ.1.80 కోట్లు, 20 మీసేవా కేంద్రాల ఏర్పాటుకు రూ.50 లక్షలు, 100 మందికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రూ.రెండు కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. వాటితో పాటు ఈవెంట్లు, క్యాంటీన్లు, మిల్క్ సెంటర్ల ఏర్పాటు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంటు ఇలా పలు సెంటర్ల ఏర్పాటుకు రుణాలు ఇవ్వనున్నారు.

వ్యక్తిగత, సమూహ అవకాశాలు

మహిళా సంఘాల సభ్యులు ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌ల యూనిట్లను నెలకొల్పి ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. గత ఏడాది వ్యవసాయేతర రంగాలలో 3,346 మంది యూనిట్లను స్థాపించి, వ్యక్తి గతంగా ఉపాధి పొందుతున్నారు. ఇవే కాకుండా ప్రధాన మంత్రి విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ పథకం కింద గతేడాది 55 యూనిట్లు మంజూరయ్యాయి. 164 మందిని ఎంపిక చేసి, ఉపాధి కల్పించారు వీరు నాణ్యమైన, కల్తీలేని ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయం చేస్తున్నారు. ఇవి కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమీషన్, వ్యవసాయ యూనిట్లను అద్దెకు ఇవ్వడంతో వచ్చే అద్దెతో గ్రామ సమాఖ్యలు ఆదాయాలను సమకూర్చుకుంటున్నాయి.

జిల్లాలో మహిళా సంఘాలు ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 12 మండలాలు ఉన్నాయి. వీటిలో 311 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఈ సమాఖ్యలలో 6,718 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 74,625 మంది సభ్యులుగా ఉన్నారు. సభ్యుల సంఖ్య పెంచడానికి కొత్తగా చేర్చుకుంటున్నారు. దాంతో సంఘాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గ్రామ సమాఖ్యలను, పొదుపులను పెంచే దిశగా అడుగులు పడుతున్నాయి. స్వయం ఉపాధితో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.


రుణంతో రొట్టెల వ్యాపారం



నేను కొన్నేళ్లుగా రొట్టెల వ్యాపారం చేస్తున్నాను. గిరాకీ బాగానే ఉంటుంది. కానీ రొట్టెలు చేసేవాళ్లు లభించడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ పథకం ద్వారా రూ.3.5లక్షల రుణం వచ్చింది. దాని సహాయంతో రొట్టెల యంత్రం కొనుగోలు చేశాను. ఇప్పుడు ఎన్ని రొట్టెల ఆర్డర్లు వచ్చినా సులభంగా విక్రయిస్తున్నాను. రుణంపై 35 శాతం సబ్సిడీ లభించింది.

- చిన్న వెంకటమ్మ, మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, మదనపల్లి

స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం



పేదరిక నిర్మూలనే లక్ష్యంగా స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పడానికి మహిళలను ప్రోత్సహిస్తున్నాం. దాని వలన వారి జీవనోపాధులు మెరుగు పడుతాయి. కుటుంబం ఆర్థికంగా బలపడుతుంది. వారి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తారు. అనేక యూనిట్లను ఏర్పాటు చేయిస్తున్నాం. అందుకు మహిళల నుంచి మంచి స్పందన ఉంది.

- నర్సింగరావు, డీఆర్‌డీవో, గద్వాల

పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు?

- విజయోత్సవ సభలో పాలమూరు ఎంపీ డీకే అరుణ



జోగుళాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల, జూలై 9: తెలంగాణ ప్రభుత్వంలో పదేళ్లు అధికారంలో ఉన్నవారు ఏం అభివృద్ధి చేయకుండా ఇప్పుడు అధికార పార్టీలోకి వెళ్లి ఏం అభివృద్ధి చేస్తారని పాలమూరు ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. పదేళ్లుగా అభివృద్ధి లేక గద్వాల పూర్తిగా వెనకబడిపోయిందని అన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారి గద్వాలకు వచ్చిన ఆమెకు బీజేపీ నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతాపురం స్టేజీ వద్ద గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి జములమ్మ ఆలయానికి చేరుకున్న అరుణకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి గద్వాల పుర వీధులగుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్వీ ఈవెంట్ హాల్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ గద్వాలలో రాజకీయ పరిణామాలను చూస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వాళ్లు ఇద్దరూ ఇప్పుడు ఒకే పార్టీలో చేరిపోయారని ఎద్దేవా చేశారు. ఇక్కడ ఓడిపోయిన ఆమె నన్ను ఓడించడానికి శపథం పన్ని మహబూబ్‌నగర్ మొత్తం తిరిగిందన్నారు. గద్వాలలో చేయాల్సిన అభివృద్ధి చాలా ఉందని అన్నారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు లేరని, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్డీఎస్ ప్రాజెక్టుల సమస్యలు ఉన్నాయన్నారు. అభివృద్ధితో పాటు విద్య, వైద్యం సదుపాయాలు, సమస్యల పరిష్కారం కోసం అధికార పార్టీలో ఉన్న వాళ్లు కృషి చేయాలని అన్నారు. పాలమూరు ఎంపీనైనా ఇక్కడి ప్రాంత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాములు, భరత్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు టపాల కృష్ణవేణి, కౌన్సిలర్ రజక జయశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వరుడి మృతి

- కోమాలోకి వధువు
- పెళ్లైన రెండు వారాల్లోనే విషాదం



చందు(ఫైల్)

మక్తల్, జూలై 9: నవ దంపతులు బైక్‌పై అత్తారింటికి వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో వరుడు మృతి చెందగా, వధువు కోమాలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో వధువు సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ వద్ద మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మక్తల్ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన చందు(26)కు, కర్ణాటక రాష్ట్రం కడెచూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మితో రెండు వారాల క్రితం వివాహం జరిగింది. ఆషాఢమాసం ప్రారంభం కావడంతో విజయలక్ష్మిని తీసుకెళ్లడానికి సోదరుడు పరశురాం వచ్చాడు. చందు, విజయలక్ష్మి, పరశురాం ముగ్గురూ కడెచూరుకు మంగళవారం బైక్‌పై బయల్దేరారు. కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో చందు(26) అక్కడికక్కడే మృతి చెందాడు. విజయలక్ష్మికి తీవ్ర గాయాలై, కోమాలోకి వెళ్లింది. పరుశరాం కూడా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను సైదాపూర్ ఆస్పత్రికి తరలించారు. పెళ్లైన రెండు వారాల్లోనే చందు మృతి చెందడంతో ముష్టిపల్లిలో విషాదం చోటు చేసుకుంది.



హైదరాబాద్‌లో మహిళా మోర్చా నాయకుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా నాయకులు

మహబూబ్‌నగర్ (క్లాకటవర్), జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా జరిగింది. ఆ ధర్నాకు జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో మహిళలు తరలి వెళ్లారు. అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తూనే ఉంటామని వారు స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర మహిళా మోర్చా కమిటీ అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు యాదమ్మ, విజయలక్ష్మి, శకుంతల, పుష్పలత, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి వెళ్లినవారిలో ఉన్నారు.



టీచ్ ఫర్ చేంజ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, సినీ నటి మంచు లక్ష్మి


విద్యార్థులతో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, సినీ నటి మంచు లక్ష్మి

నారాయణపేట రూరల్, జూలై 9 : విద్యా వ్యవస్థలో మార్పు తీసుకువచ్చేందుకు టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు, సినీనటి మంచు లక్ష్మీలు కోరారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్ర మండలంలోని కొల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను వారు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా మంచు లక్ష్మీ మాట్లాడుతూ స్మార్ట్ క్లాసరూం ఇనిషియేటివ్, ఫ్లో ఫార్వర్డ్ ప్రాజెక్ట్ యువతకు నాణ్యమైన, అవసరమైన, ఆరోగ్య విద్యను అందించాలనే ఉద్దేశంతో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నాయన్నారు. విద్యార్థులు చేయగల వాతావరణాన్ని సృష్టించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. విద్యాపరంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ స్థానిక కమ్యూనిటీపై ఈ కార్యక్రమాల ప్రభావాన్ని నొక్కిచెప్పారు. స్మార్ట్ క్లాసరూం ఇనిషియేటివ్, ఫ్లో ఫార్వర్డ్ ప్రాజెక్టు నిస్సందేహంగా తమ ప్రాంతంలో చాలామంది యువకులు, బాలికల జీవితాలపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ చొరవకు మద్దతు ఇవ్వడంతో పాటు టీచ్ ఫర్ చేంజ్, వేణురావు ఫౌండేషన్ చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు రత్నాకర్‌రావు, పాఠశాల హెచ్ఎం అనురాధ, ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం .. జలమయం

- జడ్చర్ల ఏరియా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద నిలిచిన వర్షం నీరు

జడ్చర్ల, జూలై 9 : జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద వర్షం నీరు నిలవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, ఇతరులు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ఆసుపత్రి పక్కనే ఉన్న మురుగు కాలువలో నుంచి నీరు ఆ ప్రాంతమంతా పారడంతో ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు వరకు వచ్చి చేరాయి. ఆసుపత్రి పక్కనే ఉన్న మురుగుకాలువను మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ ఇటీవల కలెక్టర్ దృష్టికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తీసుకెళ్లారు. ఇక ముందు వర్షం నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని ఆసుపత్రికి వచ్చిన రోగులు కోరుతున్నారు.


జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద నిలిచిన వర్షం నీరు

చిన్నపాటి వానలకే చిత్తడవుతున్న రోడ్లు

- ఎక్కడ గుంత.. ఎక్కడ మిట్టో తెలియని పరిస్థితి - ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటేనే జంకుతున్న జనం


మిడ్జిల్ : బురద, గుంతలయమమైన చిలువేరు గ్రామ రోడ్డు


నీటితో నిండిన రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వెళ్లే రోడ్డు

గండీడ్, జూలై 9 : చిన్న పాటి వానలకే రోడ్లు గతుకులమయమ య్యాయి. రోడ్డుపై వాహనాలపై ప్రయాణం చేస్తే కుంటల్లో వెళ్లినట్టుంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ మిట్ట ఉందో తెలియని పరిస్థితి రంగారెడ్డి పల్లి నుంచి గుముడాల తండా గేటు వరకు రోడ్డుకు 6.7 కిలోమీటర్లు మరమ్మతుకు గాను ఇప్పటివరకు కాంట్రాక్టర్ అనురాగ్ కన్‌స్ట్రక్షన్ రూ.1.3 కోట్లు మంజూరై, వారికి టెండర్ దక్కింది. కానీ, ఇప్పటి వరకు రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రతీ రోజు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు బైకులపై బయలుదేరాలంటేనే ప్రాణం అరచేతుల్లో పెట్టుకొని వాహనాలను నడపాల్సి వస్తున్నది.

చిలువేరులో అధ్వానంగా అంతర్గత రోడ్లు

మిడ్జిల్ : మండలంలోని చిలువేరు గ్రామంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లమీద నడువలేని పరిస్థితి నెలకొంది. ఎస్సీ కాలనీలో రోడ్లు ఎప్పటికీ బురదమయంగా ఉండి దోమలు, ఈగలకు ఆవాసంగా మారాయి. దీంతో ప్రజలు వివిధ అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్నా ఫలితం లేదని, చిలువేరు నుంచి అయ్యవారిపల్లికి వెళ్లే దారిలో రోడ్డు పూర్తిగా అధ్వాన పరిస్థితిలో ఉందని తెలిపారు. రోడ్డు బురదతో, మురుగునీటితో ఉండటంతో పలుమార్లు ద్విచక్ర వాహనదారులు కిందపడిన సంఘటనలెన్నో ఉన్నాయని, గ్రామంలోని అధ్వానంగా ఉన్న రోడ్లను బాగుచేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





అవకాశాలను వినియోగించుకోవాలి

- పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రకిరణ్


సమావేశంలో మాట్లాడుతున్న పీయూ ప్రిన్సిపాల్ ఎన్. చంద్రకిరణ్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 9 : విద్యార్థులు వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చంద్రకిరణ్ అన్నారు. మంగళవారం పీయూ పీజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ)విభాగం విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే కష్టమని, ప్రభుత్వ ఉద్యోగాలు చదువుకున్న ప్రతీ ఒక్కరికి రావని, విద్యార్థులు ఏదైనా అవకాశం వస్తే వెళ్లాలని సూచించారు. నైపుణ్యం ఉన్న విద్యార్థులు ఏ రంగంలోనైనా సాధిస్తారని తెలిపారు. అనంతరం ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులకు పీయూ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఉద్యమ్ లర్నింగ్ ఫౌండేషన్ బెంగళూరు సంస్థకు చెందిన తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జె.జయవర్ధన్, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణవంశీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల ఇంటర్వ్యూలకు 18 మంది హాజరయ్యారు. వీరిలో 10మంది వరకు ఎంపిక అవుతారని పీయూ విభాగాధిపతి డాక్టర్ బండి పర్వతాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీయూ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ అర్జున్ కుమార్, ఎంఎస్‌డబ్ల్యూ విభాగం అధ్యాపకులు డాక్టర్ గాలెన్న, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మా సారు మాకే కావాలి

- బదిలీపై వెళ్లొద్దని వేడుకోలు
- తహసీల్దార్, ఎంఈవోలకు తండావాసుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తండావాసులు

హన్వాడ, జూలై 9 : మా తండా పాఠశాలకు ఇక్కడ పని చేస్తున్న మల్లేష్ సారే మాకు కావాలని మండలంలోని ద్రొరితండా గిరిజనులు అధికారులను వేడుకున్నారు. మంగళవారం తండాకు చెందిన గిరిజనులు తహసీల్దార్, ఎంఈవో, ఇతర మండల అధికారులను కలిసివినతి పత్రాలు ఇచ్చారు. ఎనిమిదేళ్లుగా మల్లేష్ ఉపాధ్యాయుడు తండాలో పని చేస్తు ఇటివల నిర్వహించిన బదిలిలలో అతను బదిలి అయ్యాడు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు, తండాలోని గిరిజనులు మాకు ఈ సారే కావాలని కోరుతున్నారు. రెండు రోజుల క్రితం విద్యార్థులు కుడా సారు మీరు వెళ్లొద్దని వేడుకున్నారు. ఆయన ఇక్కడ పని చేసిన ఎనిమిదేళ్లలో 96 మంది విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చాయని, అలాంటి ఉపాధ్యాయున్ని మా నుంచి దూరం చేయొద్దని తండావాసులు అధికారులను కోరారు. కనీసం డిప్యూటేషన్‌తో అయినా మా పాఠశాలకు పంపించాలని కోరారు.

నిలిచిన నేరేడు చెరువు రిజర్వాయర్ పనులు

- పూర్తి చేయని కాలువల నిర్మాణం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఏడేళ్లుగా ఎడారిని తలపిస్తున్న ప్రాంతం
- వలస బాట పట్టిన ముంపు రైతులు


మామిడిమాడ నేరేడు చెరువు రిజర్వాయర్

ఖిల్లాఘణపురం, జూలై 9: బీఆర్ఎస్ హయాంలో ఏడేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నేరేడు చెరువు రిజర్వాయర్ పనులు నిలిచిపోయాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడి మాడ గ్రామ శివారులోని నేరేడు చెరువు, వేములోని చెరువును కలిపి నేరేడు చెరువు రిజర్వాయర్‌గా మార్చడానికి 2017లో శ్రీకారం చుట్టింది. చెరువులోని 418 ఎకరాల భూమిని సేకరించారు. రెండు సంవత్సరాల పాటు పనులు బాగానే నడిచాయి. తదనంతర కాలంలో పనులు నిలిచిపోయాయి. వానాకాలంలో చెరువులోకి వచ్చే వర్షపు నీటిని సైతం పక్కకు మళ్లించడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. చెరువులో భూములను కోల్పోయిన రైతులు వ్యవసాయానికి దూరమై ఇతరుల పంట పొలాల్లో వ్యవసాయ కూలీలుగా మారారు. మరికొందరు జీవనోపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లారు.

నేరేడు చెరువు రిజర్వాయర్ లక్ష్యం

ఖిల్లాఘణపురం మండలంలోని ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఘణపురం బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నేరేడు చెరువు వేములోని చెరువులను అనుసంధానం చేసి మామిడిమాడ జలాశయంగా మార్పు చేసి 0.2 టీఎంసీల నీటి నిల్వ సామార్థంతో నిర్మించాలని నిర్ణయించారు. ఈ రిజర్వాయర్ ద్వారా 1500 ఎకరాలకు సాగునీరును అందించేలా ప్రణాళికలు రూపొందించారు. నేరేడు చెరువు రిజర్వాయర్‌కు కుడివైపు ఒక కాలువ తవ్వి కమలోద్దిన్‌పూర్ చెరువుకు, ఎడమ వైపుకు మరో కాలువ తవ్వి ఘణపురం చెరువుకు నీరు అందించాలనే లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. మామిడిమాడ రిజర్వాయర్ ద్వారా పర్వతాపూర్, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపూర్, తిరుమలాయపల్లి, కమలోద్దిన్‌పూర్, అంతాయపల్లి, గ్రామాల చెరువుల ఆయకట్టుకు సాగునీరు అందించాలని గణప సముద్రం రిజర్వాయర్ ద్వారా గణపురం, వెంకటంపల్లి, గట్టుకాడిపల్లి, మహమ్మద్‌హుస్సేన్‌పల్లి, నిజాలాపూర్ ద్వారా ఎన్‌హెచ్ 44 రోడ్డు వరకు 5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారు 25కిలో మీటర్ల పరిధిలోని వివిధ గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువులను కృష్ణా జలాలతో నింపడానికి ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు, మైనర్ కాలువలు, మధ్యలో స్ట్రక్టర్లు తదితర వాటిని రూపొందించాలని నిర్ణయించారు. వీటి కోసం అంచనా విలువలను పెంచి పనులను ప్రారంభించారు. ఈ ఏడేళ్లలో రిజర్వాయర్ పనులు 50 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం.

రిజర్వాయర్ నిర్మాణంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం



నేరేడు చెరువు రిజర్వాయర్ నిర్మాణంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతో పనులు నిలిచిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటి మామిడిమాడ పరిసర ప్రాంతాలు ఎడారిగా మారా యి. నేరేడు చెరువు రిజర్వాయర్ భూ నిర్వాసితులం దిక్కుతోచని స్థితిలో వలస వెళ్లి జీవనోపాధి పొందుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వమైనా జలాశయం పనులు వెంటనే ప్రారంభించి ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.

- నిరంజన్ గౌడ్, ముంపు రైతు, మాజీ ఎంపీటీసీ, మామిడిమాడ

కెనాల్ పనులు మిగిలిఉన్నాయి

నేరేడు చెరువు రిజర్వాయర్ పనులు 50 శాతం పైగా పూర్తయ్యాయి. కెనాల్స్ నిర్మాణం పనుల మిగిలి ఉంది. కాల్వల నిర్మాణంలో డిస్ట్రిబ్యూటర్లు, స్ట్రక్టర్లు తదితర పనులతో పాటు కొంతభాగం రిజర్వాయర్ బండ్ పనులు మిగిలి ఉన్నాయి. త్వరలో జలాశయం పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. 20 రోజుల క్రితం కాంట్రాక్టర్ బాలచంద్రారెడ్డి మరణించారు. పనులు కొత్త వాళ్లకు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- మధుసూదన్ రావు, ఈఈ , నీటిపారుదల శాఖ

ఆదివాసీలు అడవులను వీడితే నష్టపోతారు

- సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి


సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

మన్ననూర్, జూలై 9: తరతరాలుగా అడవి తల్లినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీ చెంచులు అడవులను వీడి మైదాన ప్రాంతాలకు తరలివెళ్తే నష్ట పోతారని వక్త, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నల్లమల ప్రాంతంలోని చెంచులకు ఆదివాసీ హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్యం ఏర్పడిన నాటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినా చెంచుల బతుకులు బాగుపడక పోవడం బాధాకరమన్నారు. ఆదివాసీ చెంచులకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పాలకులు వారిని అడవులు, పెద్దపులుల రక్షణ పేరిట మైదాన ప్రాంతాలకు తరలించేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెంచులు ప్రభుత్వాలు చూపే ప్రలోభాలకు లొంగి పునరావాసానికి ఒప్పుకోవద్దన్నారు. బ్రిటిష్ పాలనలో అడవులను నరికేందుకు అటవీ అధికారులు ఉండేవారని, అడవులను నరుకకుండా అడ్డుపడిందే ఆదివాసీ చెంచులన్నారు. అప్పట్లో ఆదివాసీలకు లక్షా 80 వేల ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వగా, ప్రభుత్వాలు ఆదివాసీలకిచ్చిన భూములను లాగేసుకున్నాయని అన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న రాజకీయ ప్రజాప్రతినిధులు, పాలన సాగించే ఐఏఎస్ స్థాయి అధికారులు జోకర్లు, బ్రోకర్లుగా మారి ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా అడవుల్లో ఉండే యూనియం, ఖనిజాలు, వజ్రాలు దోపిడీ చేసేందుకు అమెరికాకు చెందిన కార్పొరేట్ శక్తులను నల్లమల అడవులపై కన్నుపడేలా చేయడానికి మన పాలకులే కారణమన్నారు. గతంలో దేశ వ్యాప్తంగా పునరావాస ప్యాకేజీలు కల్పించిన వారి పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయని, ఆదివాసీ చెంచులు అట్టి ప్యాకేజీలకు ఒప్పుకోకుండా, చట్ట ప్రకారంగా తమకు కల్పించాల్సిన వసతులపై ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి జక్క బాలయ్య, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహ కార్యదర్శి ముద్దునూరి లక్ష్మీనారాయణ, ప్రజా సంఘాల నాయకులు, బాలకిష్టయ్య, వెంకటేష్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు నల్లపోతుల కృష్ణ, బయ్యన్న , పెద్దిరాజు పాల్గొన్నారు.

భూ వివాదంలో దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 9 : భూవివాదంలో దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన పర్వతాలుగౌడ్ అతడి భార్య లక్ష్మీ, అతడి కుమారుడు శివయ్యగౌడ్ భూ వివాదంలో దాడి చేశారని మద్ది బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఫిర్యాదు

- భర్త, అత్తపై కేసు నమోదు


నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 9: భర్త, అత్త వేధిస్తున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన వివాహిత కల్మూరి రేణుక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కల్మూరి రేణుకకు 12ఏళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన రవికుమార్‌తో వివాహమైంది. మూడేళ్లుగా అత్తింటివారి వేధింపులకు తట్టుకోలేక తల్లి గారింటి దగ్గరే ఉంటుంది. ఇటీవల మూడు నెలల క్రితం రవికుమార్ రెండవ వివాహం చేసుకున్నాడు.. పెళ్లి ఎందుకు చేసుకున్నావంటూ నిలదీయడంతో మళ్లీ వేధించడం మొదలుపెట్టారు. ఈ ఘటనపై నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త హత్యకేసులో భార్యకు శిక్ష

- రూ.20 వేలు జరిమానా

మరికల్, జూలై 9 : భర్త హత్య కేసులో ఓ భార్యకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు డీఎస్పీ లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్దచింతకుంట గ్రామానికి చెందిన మరాఠి శ్రీనివాసులు (35) ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి తండ్రి మరాఠి పరమేశ్వర్ ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ 7-12-2022 రోజు మరికల్ పోలీస్ స్టేషన్లఓ ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ అశోక్‌బాబు ఎఫ్ఆర్ఐ నమోదు చేయగా అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి చార్జిషీట్ నమోదు చేయగా, సీఐ రాంలాల్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. మృతుడి భార్య సుజాత అక్రమ సంబంధానికి తన భర్త అడ్డుగా ఉన్నాడని భావించి మద్యం మత్తులో ఉన్నప్పుడు రాత్రి పడుకున్న తర్వాత భర్త మొహంపై దిండు పెట్టి చంపినట్లు నేరం రుజువు కావడంతో మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో నేరస్తులకు శిక్ష పడటంలో పని చేసినా సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళి, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను డీఎస్పీ అభినందిస్తూ త్వరలో వీరికి రివార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి


యాదయ్య(ఫైల్)

కల్వకుర్తి టౌన్, జూలై 9: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన రైతు వసంత యాదయ్య(48) మంగళవారం పాముకాటుతో చనిపోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని జేఎల్‌బీ రోడ్డులో నివాసం ఉండే యాదయ్య రోజు మాదిరిగానే ఉదయం కైలాసంగుట్ట సమీపంలో ఉండే తన పొలానికి వెళ్లాడు. పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటేసింది. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మరణించాడు. యాదయ్యకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి

కొల్లాపూర్, జూలై 9 :గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించినట్లు త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో మృగవాణి రిసార్ట్‌లో రెండు రోజుల పాటు జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పలు అంశాలను తీర్మానించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. తీర్మానంలో జీవో ఎంఎస్ నెంబరు 1112 సవరిస్తూ బీఈడీ అర్హత గల ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతి అవకాశం కల్పించాలని గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పీఎస్ హెచ్‌ఎంల సంఖ్య పదివేలకు పెంచాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీలో 2023 నుంచి ఆర్థికలాభం వచ్చే విధంగా 50శాతం ఫిట్మెంట్ వర్తింపజేయాలన్నారు. సర్వీస్ రూల్స్ వెంటనే ఇప్పించి ఎంఈవో, జూనియర్ లెక్చరర్ అన్నింటిల్లో కూడా ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలి, ఉద్యోగ భద్రత కల్పించాలని, 317వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ వారి జిల్లాలకు పంపించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్, గురుకుల, ట్రైబల్, వెల్ఫేర్‌లలోని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బట్టాపురం మోహన్‌రెడ్డి, పూల రవీందర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, ఇన్నారెడ్డి, 33 జిల్లాల పీఆర్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కొల్లాపూర్ నియోజకవర్గ మండల పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు దంపతుల ఫిర్యాదు


మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన జిన్‌కుంట గ్రామ దంపతులు

బల్మూరు, జూలై 9: యువ ప్రేమ జంట గ్రామంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో బల్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు జిన్‌కుంట గ్రామానికి చెందిన మద్దిలేటి బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం... జిన్‌కుంట గ్రామానికి చెందిన మహేష్, భానుమతి ప్రేమ వివాహం చేసుకున్నారు. మానసిక ఆవేదనకు గురై జూన్ 9న ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దలు సమక్షంలో పంచాయితీ జరగడంతో మృతురాలి తండ్రి పోలేకుమార్‌కు రూ.3లక్షల చెల్లించాలన్నారు. పోలే కుమార్‌తో పాటు వారి బంధువులు చంపేస్తామని బెదిరించడంతోనే తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మృతులు మహేష్, భానుమతిల సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డులను పోలీసులు పరిశీలించిన కూడా న్యాయం జరగక పోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. స్థానిక పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఫోన్ల రికార్డులను పరిశీలించి తన కోడలు భానుమతి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

కళాశాల ప్రహరీ పూర్తయ్యేదెప్పుడో?

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న క్రీడా మైదానం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


ధరూరు ప్రభుత్వం జూనియర్ కళాశాల ముందు నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణం

ధరూరు, జూలై 9 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్మాణంలో ఉన్న కాంపౌండ్ వాల్ అర్థాంతరంగా నిలిచిపోయింది. నిధులులేని కారణంగా కాంట్రాక్టర్ బేస్‌మెంట్ స్థాయిలో మాత్రమే పనులు చేపట్టి వదిలేశారు. సుమారు 460 మంది ఉన్న ఈ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం చినుకు పడితే చాలు క్రీడా ప్రాంగణమంతా చిత్తడిగా మారడంతో ఇబ్బందిగా ఉందని విదార్థులు వాపోతున్నారు. 2013 జనవరిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం సంబంధిత అధికారులు రూ.9 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కేవలం బేస్‌మెంట్ మాత్రమే ప్రారంభించిన కాంట్రాక్టర్ మళ్లీ నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో వర్షాకాలంలో కళాశాల ప్రాంగణం మొత్తం వర్షపు నీరు నిలిచిపోవడంతో కళాశాల లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ప్రిన్సిపాల్ ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలిపినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు క్రీడా స్థలంతో పాటు కళాశాలలోకి వర్షపు నీరు కూడా లోపలికి రాకుండా ఉంటుందని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది సైతం చెబుతున్నారు.

విష పురుగులతో విద్యార్థుల సావాసం

కాంపౌండ్‌వాల్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో కళాశాల పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో విష పురుగులు కళాశాలలో సంచరిస్తున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్థారంతంగా నిలిచిపోయిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పూర్తి చేస్తే ఇటు క్రీడా ప్రాంగణం అందుబాటులోకి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

కాంపౌండ్ వాల్ నిర్మాణం నిలిచిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాం. నిధులు లేని కారణంగా పనులు నిలిపివేశారు. అధికారులతో చర్చించి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- కృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను నియమించాలి


ఉపాధ్యాయుల కోసం రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

చిన్నంబావి, జూలై 9: జడ్పీహెచ్ఎస్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అయ్యవారిపల్లి హై స్కూల్‌లో గతేడాది నుంచి హిందీ, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులను బోధించేందుకు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

శ్రీరంగాపురం, జూలై 9: డ్రంకెన్ డ్రైవ్ కేసులో వీపనగండ్లకు చెందిన వ్యక్తికి జైలు శిక్ష పడిందని శ్రీరంగాపురం ఎస్ఐ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెంకటాపురం సమీపంలో 2019లో పోలీసులు తనిఖీల సందర్భంగా పెబ్బేరు నుంచి వీపనగండ్లకు వెళ్తున్న ఒక వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో అతన్ని కోర్టులో హజరు పరచారు. వనపర్తి ఆడిషనల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

అమరచింత, జూలై 9: వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి భవన నిర్మాణ కార్మికుడు ఉప్పరి కర్రెన్న (56) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే పట్టణంలోని ఓ కాలనీలో భవనం నిర్మాణంలో ఉండగా సదరు మేస్త్రీ మాల మార్కమ్మ తోటి మేస్త్రీలు పని చేసే భవన నిర్మాణ కార్మికులకు, స్నేహితులకు భోజనానికి ఆహ్వానించారు. రెండో అంతస్తులో భోజనం చేసి కిందికి వస్తుండగా ఉప్పరి కర్రెన్న ప్రమాదవశాత్తు పైనుంచి జారిపడి తలకు తీవ్ర గాయం అయింది. దీంతో అక్కడున్న వారు మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కర్రెన్న మృతి వార్త విన్న కుటుంబీకులు, బంధువులు, తోటి పనివాళ్లు రోదించారు.

స్కూల్ బస్సు డ్రైవర్ పై కేసు నమోదు

గోపాల్‌పేట, జూలై 9 : ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని బుద్దారం గ్రామ పరిధిలో ఉన్న పాటిగడ్డ తండాకు చెందిన ముడావత్ నార్య జంగమయ్యపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో అపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులు ముగించుకొని పాటిగడ్డ తండాకు వస్తుండగా బుద్దారం సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు నార్య బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నార్య గాయపడ్డారు. గ్రామస్థుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. నార్య భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు స్కూల్ బస్సు డ్రైవర్ గంధం గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9: గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణ కోసం అర్హులైన మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఆమె పేర్కొన్నారు. ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్శీ మతాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 19వ తేదీన సాయంత్రం ఐదు గంటలలోపు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు.

దళిత రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలి


రైతులకు కూరగాయల నారు అందిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మదనాపురం, జూలై 9: దళిత రైతులు వ్యవసాయ సాగులో ఆర్థిక అభివృద్ధి సాధించాలని కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రంలో రేవల్లి మండల దళిత రైతుల పది కుటుంబాలకు కూరగాయల నారు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగులో దళిత రైతులు వెనుకబడి ఉన్నారని అన్నారు. వీటిని సాగు చేయడం వలన ఎక్కువ పని దినాలు ఉంటాయన్నారు. తక్కువ కాల పరిమితిలో పంట చేతికి రావడం, కూరగాయలను ఎక్కువసార్లు కోతకోయడం జరుగుతుందన్నారు. దీని వలన ఆ కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి సాధించడమే గాక ఆరోగ్యంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు భోగరే రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగడ్డ ప్రజల గుండెల్లో గులాబీ జెండా

- శాట్స్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్
- ఎమ్మెల్యే పార్టీ మార్పుపై బీఆర్ఎస్ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

గద్వాల టౌన్, జూలై 9 : నాయకులు పార్టీలు మారినా నడిగడ్డ ప్రజల గుండెల్లో మాత్రం గులాబీ జెండానే నిలిచిందని శాట్స్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాలలో చూసిన ప్రజలు కాంగ్రెస్ ఆరునెలల పాలనలోనే విసిగి పోయారన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. అభివృద్ధి ముసుగులో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజల కంటే తన స్వార్థ ప్రయోజనాలే ముఖ్యమన్నది మరోసారి స్పష్టమైందన్నారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ద్వారా వచ్చిన పదవిని వీడి తిరిగి ప్రజా తీర్పు కోరాలని సవాల్ విసిరారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పాలమూరు ప్రచారంలో బంగ్లా, బండ్ల ఏకమై బీసీ బిడ్డకు అన్యాయం చేశారని, ఊరూరా ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి ఏం ప్రయోజనం ఆశించి ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకున్నారో ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకు జోగుళాంబ గద్వాల జిల్లా పార్టీ సమన్వయకర్తగా రాష్ట్ర నాయకత్వం తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించిందని ఆంజనేయగౌడ్ వివరించారు. వచ్చే సోమవారం గద్వాలలో ప్రజా ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని, సభకు మాజీ మంత్రులు హరీష్‌రావు లేదా కేటీఆర్‌లు హాజరవుతారన్నారు. సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు బాసు హనుమంతునాయుడులు ఎమ్మెల్యే పార్టీ మార్పు తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సమావేశంలో పుల్లయ్య, అతికేఉర్ రెహమాన్, మోనేష్, మల్లికార్జున్ ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కోస్గి, జూలై 9 : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం సంపల్లి గ్రామానికి చెందిన ఆశప్ప మిషన్ భగీరథ వాటర్ లైన్‌మెన్‌గా ముశ్రీఫా క్లస్టర్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో పని ముగించుకొని గ్రామానికి వెళ్లేందుకు వస్తుండగా కోస్గి శివారులోని మైసమ్మగుడి దగ్గర ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఆశప్పకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కోస్గిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమణ తెలిపారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కాని నిధులు
- కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి
- సర్దుబాటు చేయలేక చేతులెత్తేస్తున్న కార్యదర్శులు
- ఇబ్బందుల్లో పంచాయతీ కార్మికులు

వనపర్తి రూరల్, జూలై 9: గ్రామ పంచాయతీలలో నిధులు లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. చాలా గ్రామాల్లో సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడం సమస్యగా మారింది. కొన్ని పంచాయతీలకు మాత్రమే ఆదాయం ఉంటుంది. అలాంటి చోట పెద్దగా ఇబ్బంది లేదు కానీ మిగతా పంచాయతీల పరిస్థితి దయనీయంగా మారింది. విద్యుత్ దీపాల నిర్వహణ, బిల్లులు చెల్లింపులు తాగునీటి పథకాల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు ఇలా ప్రతీ పనికి డబ్బులు అవసరం కానీ మెజార్టీ పంచాయతీలో డబ్బులు లేకపోవడం సమస్యగా మారింది. దీంతో అప్పులు చేయాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్ మొదలైంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. శానిటేషన్ పనులు చేయడానికి డబ్బులు లేక కార్యదర్శులు పరేషానవుతున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 80 శాతం పంచాయతీలో చిల్లిగవ్వ కూడా లేదని అధికారుల ద్వారా తెలిసింది. పెద్ద పంచాయతీలో షాపుల ద్వారా వచ్చే కిరాయిలతో కొంత ఊరటగా ఉంది. మిగతా అన్ని గ్రామ పంచాయతీలో డబ్బులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఎస్‌ఎఫ్‌సీ నిధులు ప్రభుత్వం ప్రతీ నెల సర్దుబాటు చేసేది. గత ఏడాది ఫిబ్రవరిలో విడుదల కాగా ఇప్పటి వరకు నయా పైసా రాలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రావడం లేదు. పాలకవర్గాల పదవీకాలం ముగియక ముందే పంచాయతీ పెద్దలు తమకు రావలసిన బిల్లులకు సంబంధించిన ఖజానాలో ఉన్న డబ్బులు ఎప్పుడో ఖాళీ చేశారు. ఇంకా చాలా మంది సర్పంచులకు చేసిన పనులకు బిల్లు రావాల్సి ఉంది. జీపీలకు ప్రత్యేక అధికారులను నియమించిన వారు చుట్టపు చూపులా వచ్చి వెళ్తున్నారు. బాధ్యత అంతా పంచాయతీ కార్యదర్శులే మోయాల్సి వస్తోంది. పంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్ల కిస్తులు చెల్లించలేకపోతున్నారు.


ఖిల్లాఘణపురం మండలం రోడ్డుమీది తండా గ్రామ పంచాయతీ కార్యాలయం

జీతాలు లేక ఇల్లు గడవట్లేదు



జీతాలు లేక ఆరు నెలలు అవుతుంది. ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. జూన్, జూలై మాసం కాబట్టి స్కూళ్ల ఫీజులకు, పుస్తకాలకు చాలా ఇబ్బందిగా ఉంది. అప్పులు తీసుకొచ్చా, వీళ్ల జీతాలు ఇచ్చే వరకు అప్పులకే సరిపోతుందేమో అని భయంగా ఉంది. జీతాలు తొందరగా ఇస్తే బాగుండేది.

- రవి, అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్మికుడు

గ్రామాభివృద్ధి కోసం సొంత డబ్బులు ఖర్చు చేశా



కార్మికులకు రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. చిన్న చిన్న సమస్యలు వాటర్, డ్రైనేజీలకు సంబంధించిన పనులకు నా చేతి నుంచి దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసినా.. నాకు ఆర్థికంగా ఇబ్బంది ఉంది. అయినా గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేశాను. ఒక పక్క ఆర్థిక ఇబ్బంది, మరో పక్క పని ఒత్తిడి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

- చంద్రశేఖర్, కడుకుంట్ల గ్రామ కార్యదర్శి

డయల్ 100కి వెంటనే స్పందించాలి

- ఎస్పీ రక్షిత కే మూర్తి


మదనాపురంలో పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రక్షిత కే మూర్తి

మదనాపురం, జూలై 9: డయల్ 100కి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని ఎస్పీ రక్షిత కే మూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని అన్నారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ప్రతీ గ్రామంలోని కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. నూతన చట్టాల గురించి తెలుసుకొని శాంతి భద్రతలు అదుపులో ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరగాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్, జూలై 8: మండలంలోని అన్నారం, దావాజిపల్లిలో మంగళవారం పీహెచ్‌సీ సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనుమానితుల నుంచి తెమడ సేకరించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ రాంచందర్ మాట్లాడుతూ వ్యాధి ధూమపానం చేసే వారికి ఎక్కువగా వస్తుందని, వ్యాధి సోకిన వారు బయట తిరగరాదు, ఉమ్మరాదని సూచించారు. వైద్యులు సూచించిన విధంగా ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని తెలిపారు. వ్యాధిసోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకారం తీసుకునేందుకు ప్రతీనెల రూ. 500 ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం తెమడలో రక్తం పడటం బరువు తగ్గడం ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం, క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రేవతి, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరుతో దోపిడీ

- విచారణ చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న తాపీ కార్మికులు

కొత్తకోట, జూలై 9 : కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరుతో జరుగుతున్న దోపిడీపై విచారణ చేపట్టాలని భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వెల్ఫేర్ బోర్డు నిధులను టెండరు లేకుండా కాంట్రాక్టర్లకు అప్పజెపుతున్నారని ఆరోపించారు. నిధులు పక్కదారి పట్టిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే కార్మికులకు చెల్లించాల్సిన క్లెయిమ్స్ నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కార్మికుల పిల్లలకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, గృహ వసతి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య పట్టణ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి కురుమూర్తి, అస్కని శ్రీను, ఆశన్న యాదవ్, జనార్దన్ సాగర్, భాస్కర్, రమేష్, శ్రీను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడి


మిట్టనందిమల్ల గ్రామంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ

అమరచింత, జూలై 9: వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని, మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏడీఏ దామోదర్ అన్నారు. మంగళవారం మండలంలోని మిట్ట నందిమల్లలో ఆయన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుకూలంగా రైతులు పంట సాగుపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. వానకాలం పంట సాగులో మెలకువలతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. అధికారులు పంటల నమోదు తప్పనిసరి చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మల్లేష్, రైతులు ఉన్నారు.

ఈత వనాల తొలగింపు

- ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన గీత కార్మికులు


రంగాపురంలో ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించిన ఈత చెట్లు

పెబ్బేరు రూరల్, జూలై 9: ఈత వనాలు తొలగించిన ఘటన మండలంలోని రంగాపురంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామ సమీపంలో సర్వే నెంబరు 215లో అదే గ్రామానికి చెందిన గొల్ల సత్యన్న పట్టా భూమి పక్కల బంజరు భూమిలో తాటి, ఈత చెట్లు ఉన్నాయి. వాటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. విషయం తెలుసుకున్న గీత కార్మికులు, గౌడ సంఘం నాయకులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్లు తొలగించిన వారిపై చట్ట పరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆల్ ఇండియా డిమాండ్స్ డేను విజయవంతం చేద్దాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, జూలై 9: దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా డిమాండ్స్ డేను విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వాటర్ వర్కర్స్ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికుల వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సమావేశంలో నరేష్‌గౌడ్, శాంతయ్య, సురేందర్, రాముడు, గణేష్, మూర్తి, కృష్ణయ్య, గోవిందు, చంద్రయ్య, మహేష్, బాలకృష్ణ, విజయ్, కృష్ణ, కే మహేష్‌లను యూనియన్ అనుబంధ వాటర్ వర్కర్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ భావాలు పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యం

- జిల్లాలో ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు
- మండల కేంద్రాల్లో విద్యార్థులతో ర్యాలీలు, జెండావిష్కరణలు



జాతీయ విద్యార్థి దినోత్సవంలో భాగంగా వనపర్తి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు


జాతీయ విద్యార్థి దినోత్సవంలో భాగంగా అమరచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

వనపర్తి రూరల్, జూలై 9: విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యం అని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణి మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశ యువతలో బానిసత్వాన్ని తొలగించి వారిని జాగృతి పరిచేందుకు 1949 జూలై 9న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రారంభం అయ్యిందని తెలిపారు. కళాశాల, పాఠశాల, వసతిగృహాలు, యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పోరాటాల చేస్తుందని తెలిపారు. నాడు దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ నేడు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరిస్తూ 50 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కన్వీనర్ సాతార్ అల్లు అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ, ఖేల్ కన్వీనర్ కేదార్‌నాథ్, గర్ల్స్ ఇన్‌చార్జి రమ్య, శివ, చింటూ, ఒమేష్, జ్ఞానేశ్వర్, యశ్వంత్, వినయ్, గిరిధర్, రాకేష్, సాయి పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత : అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం అమరచింతలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, నాయకులు వంశీ, ఒగ్గు సందీప్, విగ్నేష్, నాని గౌడ్, తిరుమలేష్, గుణ,హరి, అరవింద్, రాజేష్, నరేష్, నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : దేశంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ అవతరించిందని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్ అన్నారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆయన హాజరయ్యారు. జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం నలుగురితో 76 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఏబీవీపీ జాతీయవాద భావాలతో ఏర్పడిందని గుర్తు చేశారు. నేడు దేశంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్, విశ్రాంత ఉపాధ్యాయులు లింగన్న, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు బాలు, ఏబీవీపీ నాయకులు అఖిల్, అనిల్, మనీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తకోట, జూలై 9 : ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ సంఘం రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి 200 రోజులు దాటిన రైతుల హామీలపై కమిటీలతో కాలయాపన చేయడం సిగ్గు చేటన్నారు. కార్పొరేషన్ పదవులకు నాయకులను ఎంపిక చేసే శ్రద్ధ రైతుల మీద పెట్టాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా అందడం లేదని విమర్శించారు. రూ.2 లక్ష రుణమాఫీ ఇంకా కార్యరూపం దాల్చలేదని ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12వేలు తక్షణం చెల్లించ డానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ శివకుమార్‌కు వినతి అత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ భరత్ భూషణ్, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, విక్రమ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రేవల్లిలో..

రేవల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు అజయ్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంపులయ్య, పరశురాములు, షైబూస్, నరేష్, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి : ఎంపీడీవో

పాన్‌గల్, జూలై 8: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చదివించి రాయించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9: బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను అందించనున్న బాల పురస్కార్ అవార్డుల కోసం ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆవిష్కరణలు, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇతర రంగాలలో ప్రతిభ గల 18 ఏళ్లలోపు బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నెల 31వ తేదీలోపు తమ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందజేయాలని ఆమె సూచించారు. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి : సీపీఎం

వీపనగండ్ల, జూలై 9: వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసాను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట పెట్టుబడికి ఇబ్బందులు కలగకుండా రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న రైతు భరోసా డబ్బులు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కూడా ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పోచమ్మ బోనాలకు ఏర్పాట్లు పూర్తి

అమరచింత, జూలై 9: అమరచింత పోచమ్మ బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ కృష్ణనగర్‌లో గల పోచమ్మ దేవాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు. 23వ తేదీన ఉదయం ఏడు గంటలకు పోచమ్మ అమ్మ వారికి పంచామృత అభిషేకం నిర్వహించి బోనాల పండుగను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, టీ రమేష్, చిన్న బుచ్చన్న, శివన్న, రాజు, కంకలి రవి, కురువ బాబన్న విమలన్న, జింక రవి, పెద్ద కిష్టన్న, వెంకటన్న, శ్రీను పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలి

ఆత్మకూరు, జూలై 9: శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించి ఇతరులకు రుణాలు ఇచ్చేందుకు సహకరించాలని శ్రీనిధి జిల్లా రీజనల్ మేనేజర్ ఆనంద్‌రావు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్పీలతో కలిసి మునిసి పల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో శ్రీనిధి రుణాలు పొందిన మహిళలు సకాలంలో తిరిగి చెల్లించకపోవడంతో ఇతరులు రుణాలు పొందేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో రుణాలు చెల్లించే విధంగా ఆర్పీలు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

సమస్యలపై పోరాడేందుకే అదనపు బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న గుండ్రాతి మధుగౌడ్

వనపర్తి టౌన్, జూలై 9: జర్నలిస్టుల సమస్యలపై మరింత శక్తితో పోరాడేందుకు తనకు అదనపు బాధ్యతగా రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధుగౌడ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సొంత గ్రామంలో విద్యార్థులకు కోచింగ్ సెంటర్ నిర్వహించుకుంటున్న సందర్భంలో తనపై ఒక పత్రికలో వచ్చిన కథనానికి ఆకర్షితుడినై జర్నలిస్టు వృత్తిలోకి వచ్చానని అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ జర్నలిస్టు తమ వ్యక్తిగత గౌరవం పెంచుకోవాలన్నారు. రాష్ట్రంలో మన యూనియన్ చాలా బలంగా ఉందని, అలాంటి యూనియన్‌లో తనకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శి పదవితో గౌరవించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉశన్న, పోర్దారెడ్డి, ప్రశాంత్, బొలమోని రమేష్, ఎల్లగౌడ్, శ్రీనివాసరావు, మాధవరావు, రాజు, ముంత భాస్కర్, గంధం దినేష్, లక్ష్మణ్, మన్నెం, కుమార్, సాహితి కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు ఉమ్మల రాములు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులపై దాడులు అరికట్టాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9: దళిత ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వివిధ దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఇటీవల అశ్వరావు పేట ఎస్‌ఐ శ్రీనివాసులు శ్రీరాములు ఆత్మహత్యే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వివిధ దళిత సంఘాల నాయకులు గంధం నాగరాజు, కల్మూరి వెంకటేష్, కృష్ణ నిరంజనయ్య, వెంకట కృష్ణయ్య బండారు శ్రీనివాస్, చెన్నకేశవులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై దాడులు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న

వనపర్తి వైద్యవిభాగం, జూలై 9: నిబంధనల పేరుతో ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై వైద్యాధికారులు చేస్తున్న దాడులు ఆపాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ వెంకన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటికీ అనేక మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కనీస జీవనానికి నోచుకోలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, రోగులు ఎంత ఇస్తే అంత మాత్రమే ఫీజు తీసుకుంటు సేవ చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకమై వారిలో కుటుంబ సభ్యుల్లాగా మెలుగుతూ వైద్య సేవలు అందిచే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకుంటున్నామని అన్నారు. 2015లో ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 428 ప్రకారం ఆర్‌ఎంపీ, పీఎంపీలను ప్రభుత్వం గుర్తించి సర్టిఫికెట్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నిబంధనల పేరుతో క్లినిక్‌లపై జరుగుతున్న దాడుల వల్ల ఆర్‌ఎంపీ, పీఎంపీలు మానసికంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్లినిక్‌లపై అధికారులు జరుపుతున్న దాడులను వెంటనే ఆపాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, కోశాధికారి ఎంఏ గఫార్, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చిన్న డ్యానియల్, రాష్ట్ర నాయకులు స్వామినాయుడు, కృపాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, పట్టణ అధ్యక్షుడు గంధం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ పాల్గొన్నారు.